# మళ్ళీ వచ్చేశా....

కెవ్వున అరిచినంత పనిచేసింది మధుర మీనాక్షి. పెళ్ళయిన తరువాత తన జీవితంలో పెళ్ళాం నోటి నుంచి వచ్చే ఆ అరుపులలోని తికమకల్ని ఎప్పుడూ పసికట్టలేకపోతూన్న మార్కండేయులు ఉలిక్కి పడ్డాడు.

మళ్ళీ ఏం కొంపలంటుకు పోయాయో అన్న భయంతో భార్య ఇచ్చిన కాఫీ కషాయాన్ని ప్రక్కన పడేసి గదిలోంచి చటుక్కున బయటకు వచ్చాడు.

ఆవిడ ఆనందమో! ఆవేశమో!! తెలియని అదో విధమైన భావంతో కేరింతలు కొడుతోంది.

"మధురా! ఏమిటి అమ్మాయి నుంచి ఏదైనా ఉత్తరం వచ్చిందా!!" తడబడుతూ అన్నాడు మార్కండేయులు

"ఉత్తరం ఏమిటండీ సాక్షాత్తు అమ్మాయి, అల్లుడూ వస్తేను".

దీనంగా అటు చూశాడు.

చెక్క బండి దిగి ఇవ్వడానికి జేబులోంచి చిల్లర డబ్బులు తీసి లెక్కపెడుతూన్న జిగురు మూర్తి కంటపడ్డాడు.

పై ప్రాణంపైనే ఎగిరిపోయినట్లు అయింది మార్కండేయులుకి.

"మమ్మీ" చేతి బ్యాగ్ పట్టుకొని పరుగులాంటి నడకతో లోపలికి వచ్చింది జిలేబి అనబడే జిగురు లీలాభవాని.

మొద్దులా ఉండే లీలా భవానిని మొగుడు ముద్దుగా జిలేబి అని, పిలుస్తుండటంతో అది ఆమెకు సార్ధక నామధేయమై పోయింది.

"ఎన్నాళ్ళయిందే అమ్మలూ నిన్నుచూసి" అంటూ అక్కున చేర్చుకొంది మధుర మీనాక్షి పెనంలో బుసబుస లాడుతూన్న నూనెలా.

"మొన్న పదిహేను రోజుల క్రితమేగా అల్లుడు రంజాన్ పండుగకి వచ్చి వెళ్ళింది. అప్పుడే వచ్చేయలా!" పైకి అనలేదు గాని లోలోపల వాపోతున్నాడు మార్కండేయులు. కానీ జిలేబి కూడా రావడంతో కొంత తమాయించుకున్నాడు.

"మమ్మీగారు కులాసానా?" నవ్వుతూ లోపలికి వచ్చాడు జిగురుమూర్తి.

ఆనాడు గబ్బిలాల వారబ్బాయి కదాని గురుమూర్తిని ఏరికోరి అల్లుడుగా తెచ్చుకున్నాడు మార్కండేయులు. కానీ గబ్బిలంలా వచ్చి అతుక్కుపోతుంటాడని ఊహించలేదు.

మొత్తానికి 'గులాబీ'ల వారి ఇంటి ఆడపడుచు ' గబ్బిలాల' వారి కోడలుగా వెళ్ళి 'జీ'లనుమాత్రం ప్రోది చేసుకోగల్గింది. అప్పటినుంచే భార్యను 'జిలేబి' అని పిలుచుకుంటున్నాడు.

అందరూ తనను జిగురుమూర్తి అని పిలుస్తుంటే జిగురులా అతుక్కుపోవటం అలవాటు చేసుకున్నాడు.

టెలిగ్రాఫ్ ఆఫీసులో ఎల్‌డిసిగా పనిచేసే అల్లుడు ఎప్పుడూ టెలిగ్రాఫ్ భాషనే వాడుతుండటంతో మధుర మీనాక్షి కాస్తా 'మమ్మీ' అయిపోయింది.

అత్తయినా అమ్మతో సమానమే అని సర్ధుకుపోయింది ఆవిడ. అల్లుడు ఏదో ఆఫీసు పనిమీద వచ్చి ఉంటాడులే అని సముదాయించుకున్నాడు మార్కండేయులు. ఎంత తనను తాను సర్ది చెప్పుకుంటున్నా గుండెల్లో పద్దరాయి కరగడం లేదు ఆయనకి.

"మీ అల్లుడికి సంపాదన ఏమీలేదా! ఎప్పుడూ ఇక్కడే తిరుగుతుంటుంటాడు." ప్రక్కయింటి పార్ధసారధి నిలేసి అడిగే సరికి ముఖం మున్నూరు లాకుల్లో పెట్టుకోవలసి వచ్చింది మార్కండేయులుకి.

తను పనిచేస్తున్న ఎలిమెంటరీ స్కూలు మాష్టారి ఉద్యోగానికి భయపడలేదు ఎప్పుడూ. పిల్లల్ని చెప్పుచేతల్లోనే ఉంచుతున్నాడు. మధ్యాహ్న భోజన తయారీకి అంతకన్నా వెరవడం లేదు. వంటామె రాకపోతే తానే గరిటె ప్రతాపం చూపిస్తున్నాడు. విద్యాకమిటి ఛైర్మన్లు చెలరేగితే మాటల తూటాలతో గిరికీలు కొట్టిస్తున్నాడు. అటువంటిది దశమగ్రహానికి దాసోహం అనడం మార్కండేయులకు అంతుబట్టటంలేదు.

జిగురుమూర్తి చేతిలోని బ్యాగ్ అందుకోబోయాడు. అప్పటికే అతను లోపలికి నడిచాడు.

" మామగారూ! మొన్న రంజాన్‌కి వచ్చినప్పటి బట్టలు టైలర్ ఇచ్చాడా!!" అల్లుడు దర్పాన్ని ఒలకబోస్తూ అన్నాడు గురుమూర్తి.

మామ పెట్టిన గుడ్డల్ని మామగారి ఊరి టైలరు దగ్గరే కుట్టించుకోవాలనుకొనే అల్లుడ్ని చూస్తే వళ్ళుమండుతోంది మార్కండేయులుకి.

ఎంత తల కొట్టుకుంటున్నా అర్థాంతరంగా ఊడిపడ్డ అల్లుడి రాకలోని ఆంతర్యం అర్థం కావడం లేదు మార్కండేయులుకి.

ఆలోచిస్తున్నాడు. తలక్రిందులవుతున్నాడు.

మళ్ళీ మళ్ళీ పరికించి చూస్తున్నాడు. సమాధానం లేని విషయవేదన ఆయన్ని చుట్టు ముట్టి అతలాకుతలం చేస్తోంది. శరీరంలోని ఇంద్రియాలు సహకరించని పరిస్థితి ఆయనలో.

పండుగలు, పబ్బాలమీద పడి బ్రతికే ఇలాంటి అల్లుళ్ళుంటే, కూతుళ్ళు తల్లులెలా అవుతారా? పెద్దవాళ్ళు అమ్మమ్మలెలా అవుతారు. కూతుర్ని తలచుకొంటే గుండె తరుక్కుపోతోంది మధుర మీనాక్షికి.

జిగురుమూర్తి మావగారి కంటికి నలుసు అయి కూర్చున్నాడే గాని, కూతురు కడుపున ఓ నలుసు పడేయటం లేదు.

ఎప్పటినుంచో మనవడి కోసం రోదిస్తోంది మధుర మీనాక్షి మనసు. పుట్టేవారి కోసం ఆవిడ జోలపాట ప్రాక్టీసు చేసుకుంటోంది. లాలి పాటలు నేర్చుకొంది.

ట్యూన్స్ కట్టి నెలల తరబడి రిహార్సల్స్ చేసుకుంటోంది. కాని కూతురు నెల తప్పటం లేదు.

అల్లుడు ప్రతి పండక్కి వచ్చి వాలిపోతున్నాడనే ఉక్రోషం ఆయనకి. కానీ ఒక్క విషయంలో బాగా ఆశ్చర్యపరుస్తున్నాడు. జాతీయతను ఆచరించి అన్ని మతాలను ఆదరిస్తాడు. అందుకే స్వాతంత్ర్య దినోత్సవమైనా, రిపబ్లిక్‌డే అయినా జయంతులయినా, వర్ధంతులయినా సరే మావగారితోనే జరుపుకుంటాడు.

దసరా, శ్రీరామనవమి, దీపావళి, సంక్రాంతి, మహాశివరాత్రి, నాగుల చవితి, రథసప్తమి, క్రిస్టమస్, గుడ్ ఫ్రైడే, మిలాదినబి, రంజాన్, బక్రీద్ పండుగలనాడు అత్తగారి ఆదరణతో ఆనందిస్తుంటాడు..

భిన్నత్వంలో ఏకత్వ సిద్ధాంతాన్ని తు.చ. తప్పక పాటించే జిగురుమూర్తి కుల మతాలకు అతీతంగా అన్ని పండగల్ని మామగారితో కలిసి జరుపుకోవడం ఒక బాధ్యతగా భావిస్తాడు.

ఏ పబ్బ మొచ్చినా కూతుర్ని ఇచ్చినందుకు మామగారికి తుమ్మజిగురే అవుతున్నాడు. వెంకట్రామ అండ్ కో కేలెండరు చూసి ఆ రోజు తనకు తెలియని పండుగ

ఏదైనా ప్రాశారేమోనని వెతుక్కోసాగాడు మార్కండేయులు ఎక్కడా ఏమీ కనబడలేదు.

అల్లుడి అర్ధాంతర రాకలో ఆంతర్యమేమిటో. ఆయన కంటిరెప్పలు అదురుతున్నాయి.

"ఏమిటి అల్లుడూ! ఈ ఊరిలో ఆఫీసు పని ఏదన్నా ఉందా!" హాలులో పేపరు చూస్తున్న గురుమూర్తిని అడిగాడు మార్కండేయులు.

చిన్నగా నవ్వాడు జిగురుమూర్తి.

"ఎలాగూ వచ్చావు కదా! కాసేపు రెస్ట్ తీసుకో. అలా స్కూలుకి పోయి వస్తాను. ఇవాళ ఇన్‌స్పెక్షన్ ఉంది' బయటకు నడిచాడు మార్కండేయులు.

'వచ్చిన తరువాత కనీసం అరడజను రోజులైనా అతుక్కుపోయే అల్లుడు ఈసారి ఎన్నాళ్ళకు కరుణిస్తాడో' ఎలిమెంటరీ స్కూలులో సింగిల్ టీచర్ అయిన మార్కండేయులు సింగిల్ మనసు గిజగిజలాడిపోతుంది.

అల్లుడు కదా అని ఉన్నంతలో బాగానే చూస్తున్నాడు. కానీ తనకు తెలియని పండుగలకి, కేలెండర్ వాళ్ళు రాయని పండగలని కూడా తెలుసుకొని వచ్చి వాలిపోవడమే చికాకు అన్పిస్తోంది.

ఓసారి తనలోని సర్వశక్తుల్ని కూడదీసుకొని అడిగింది మధుర మీనాక్షి "అల్లుడూ నీకు ఇన్ని రోజులు సెలవులు ఉంటే అమ్మాయిని తీసుకొని అలా హనీమూన్‌కి వెళ్ళిరావచ్చుగా!"

నవ్వు కాని నవ్వు నవ్వాడు జిగురుమూర్తి.

"సెలవులెక్కడ మమ్మీ, జిలేబికోసం డ్యూటీకి ఎక్కువ ఆబ్సెంట్ అవుతున్నానని మెమోలుఇస్తున్నాసరే వచ్చి వాలుతున్నాను" అన్నాడు. తనేదో త్యాగంచేస్తున్నట్లు ఫోజు పెట్టి.

ఏమీ చేయలేని మార్కండేయులు అల్లుడు మర్యాద ప్రోటోకాల్ ప్రకారం మరోసారి సరుకులన్నీ తెచ్చి దీనంగా ఇంట్లో పడేసాడు.

"అల్లుడూ! బిల్‌క్లింటన్ ఇండియాకు ఎందుకొచ్చాడో గ్రహించగలనుగాని, ఈసారి నువ్వు ఎందుకొచ్చావో తెలియడం లేదోయ్! మధుర మీనాక్షి ఆకులో అన్నం వడ్డిస్తూంటే అన్నాడు మార్కండేయులు.

'అదేమిటి మామగారు! అల్లుడికి అత్తాశ... పండుగకి మామగారింటికి రావడం నా జన్మహక్కు'.

"అద్సరేలేవోయ్... ఇప్పుడు పండుగలేమి లేవుగా"

"ఏకోపాధ్యాయ స్కూలు టీచర్, మీకు వేరే పండుగ చెప్పేదేముంది మామగారు. రేపటి నుండి **చదువుల పండుగ** కదా?!"

అరిటాకులోని పాయాసం గొంతు దిగలేదు ఆయనికి.

❖ ❖ ❖

ఆనందంగా వుంది మార్కండేయులుకి.

ఈ అయిదు రోజుల చదువుల పండుగ ఒక్కడే ఎలా నెట్టుకు రావాలా అని మదన పడ్డాడు. కానీ జిగురుమూర్తిని బలవంతంగా ఇన్‌వాల్వ్ చేయడంతో అల్లుడిమీద మొదటి సారి నెగ్గగలిగాడు.

మొదటిరోజు ర్యాలీలోను, స్లోగన్స్ చెప్పించడంలోను, తప్పక పాల్గొన్న జిగురుమూర్తి రెండోరోజు పేరెంట్స్, పాఠశాల విద్యాకమిటీల సమావేశాలలో సహాయం చేయమని అడిగే సరికి తెల్లముఖం వేశాడు.

మూడోరోజు గ్రామంలోని బడి వయసు పిల్లల్ని స్కూలుకి తీసుకు రమ్మనడంతో తల ప్రాణం తోకకు వచ్చినట్లయింది. ఇంటింటికి వెళ్ళి పేరెంట్స్‌ని బ్రతిమాలే అవసరం రావడంతో వారి మాటలు గుబులు పుట్టించసాగాయి.

పిల్లలతో క్లబ్‌లు ఏర్పాటు చేయడం, ముసలమ్మల చేత కథలు చెప్పించటం వంటివి చేయవలసి రావడంతో ఎప్పుడు బస్సెక్కేద్దామా అనిపించసాగింది జిగురుమూర్తికి.

పిల్లలకు ఆటల పోటీలు, క్విజ్‌లు నిర్వహించడం, సరోజినీ నాయుడు, మదర్‌థెరిస్సా వంటి వాళ్ళను గురించి వివరించడం చేతగాక తికమక పడ్డాడు. చివరిగా ముగింపు సభ మొదలైన తర్వాత మామగారి బలవంతం మీద వివిధ అంశాలను నిర్వహించవలసి రావడంతో రెమ్మ తిరిగి పోయింది.

'జాయిన్ డ్యూటీ ఇమీడియట్లీ!'

"మా మేనేజరు లీవ్ క్యాన్సిల్ చేసుకొని వెంటనే డ్యూటీలో జాయిన్ కమ్మని టెలిగ్రాం పంపాడు మామయ్యా" చూపిస్తూ అన్నాడు జిగురుమూర్తి.

దానిని నిశితంగా పరిశీలించాడు మార్కండేయులు. ఈ ఊరిలోనే అరగంట క్రితం ఇచ్చిన టెలిగ్రాం అది. ఈ బాధ భరించలేక తనే వెళ్ళి టెలిగ్రాం ఇచ్చి వచ్చిన అల్లుణ్ణి అదోలా చూశాడు మార్కండేయులు.

"అల్లుడూ ప్రతి ఏడాదీ మిగతా పండుగలకి రాకపోయినా పర్వాలేదు. చదువుల పండక్కి మాత్రం తప్పక రావాలోయ్'. నాకు సహాయకారివిగా వుందువు."

ఈ సారి అవాక్కయి పోవడం అల్లుడి వంతు అయింది.

✿

(హాస్యానందం మాసపత్రికలో ప్రచురితం)